ప్రజాశక్తి
గురువారం 30 జనవరి 2025
5
పార్వతీపురం మన్యం

కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి-బలిజిపేట

హైకోర్టు ఉత్తర్వులు ధిక్కరిస్తున్న రెండో ఎంఇఒ కె.శ్రీనివాసరావుపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు కోరారు. బుధవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక రాజకీయ నాయకులతో చేతులు కలిపి ఎంఇఒ-2 శ్రీనివాసరావు అనైతిక చర్యలకు పాల్పడడం సరైన పద్ధతి కాదన్నారు. అరసాడ ప్రాథమిక పాఠశాలలో ఆయా, కుక్ కమ్ హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్న గిరిజనులను తొలగించి, వేరే వారిని నియమించేందుకు తీర్మానించారని తెలిపారు. దీంతో గిరిజనులు హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు ఫైనల్ ఆర్డర్‌ను పాస్ చేసిందన్నారు. అయినప్పటికీ ఎస్‌ఎంసి ఛైర్మన్, రాజకీయ నాయకులుగా చలామణి అవుతున్న కొంతమంది వ్యక్తులు కలిసి తీర్మానించి, కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తున్నారని తెలిపారు. అధికారులపై ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. కలెక్టర్, డిఇఒ స్పందించి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు మోగిన నగారా

- వెలువడిన షెడ్యూల్
- 3న నోటిఫికేషన్
- పదో తేది వరకు నామినేషన్ల స్వీకరణ
- 27న పోలింగ్
- మార్చి 3న ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. దీనికి సంబంధించిన షెడ్యూల్ బుధవారం ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. తక్షణం జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి బిఆర్ అంబేద్కర్ ప్రకటించారు. ఎన్నికల నోటిఫికేషన్ ఫిబ్రవరి 3న విడుదల కానుంది. 27న పోలింగ్ జరుగనుంది. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ ఉమ్మడి జిల్లా నియోజకవర్గంతో పాటు కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే. వీటి ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ పచ్చజెండా ఊపింది. 3న నోటిఫికేషన్ వెలువడిన నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 11న నామినేషన్లు పరిశీలన చేయనున్నారు. 13వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఫిబ్రవరి 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగనుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు జరుగనుంది.

6 జిల్లాలు.. 21,555 మంది ఓటర్లు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఆరు జిల్లాల పరిధిలో 21,555 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 12,948 మంది పురుషులు కాగా, 8607 మంది మహిళలు ఉన్నారు. అత్యధికంగా విశాఖ జిల్లాలో 5,277 మంది ఉన్నారు. విజయనగరం జిల్లాలో 4,937 మంది, పార్వతీపురం మన్యంలో 2262 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1448 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య 19,587 మంది కాగా, ఈసారి స్వల్పంగా పెరిగారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాత ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం మరోసారి అవకాశం ఇవ్వనున్నట్టు సమాచారం.

ముగ్గురు మధ్యే ప్రధాన పోటీ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ప్రధానంగా ముగ్గురు అభ్యర్థులు పోటీ పడనున్నారు. యుటిఎఫ్ బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థిగా కోరెడ్ల విజయగౌరి పోటీ చేయనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆమె అభ్యర్థిత్వాన్ని యుటిఎఫ్ నాయకత్వం ప్రకటించింది. అలాగే ప్రస్తుత ఎమ్మెల్సీ పి.రఘువర్మ మరోసారి ఎపిటిఎఫ్ తరుపున పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే గాదె శ్రీనివాసులు నాయుడు పిఆర్‌టియు నుంచి పోటీలో ఉన్నట్లు ప్రకటించారు. వీరే కాకుండా ప్రైవేటు విద్యాసంస్థల తరపున కొందరు, అధ్యాపకుల సంఘం తరపున ఒకరు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్టుగా ప్రచారం ఉంది. అయినప్పటికీ ప్రధాన పోటీ విజయగౌరి, రఘువర్మ, శ్రీనివాసులనాయుడు మధ్యే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి ఇప్పటికే మూడు ఉమ్మడి జిల్లాల్లోనూ ఒక దఫా ప్రచారం చేపట్టారు. ఉపాధ్యాయులను, సంఘాలను కలిసి తనకు మద్దతివ్వాలని కోరారు. పిడిఎఫ్ అభ్యర్థులు శాసనమండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై చేస్తున్న కృషిని వివరించి, తనను గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తానని తెలిపారు.

మిగిలిన ఇద్దరూ ఇప్పటికే ఎమ్మెల్సీలుగా పనిచేసినప్పటికీ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పెద్దగా కృషి చేయకపోవడం, విద్యారంగంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వినాశకర విధానాలపైనా నోరు మెదపకపోవడం వల్ల ఈసారి విజయగౌరికి సానుకూల అవకాశాలు ఉన్నాయని ఉపాధ్యాయుల్లో చర్చనడుస్తోంది. ఇందుకు తగ్గట్టే ఆమె యుటిఎఫ్ నేతగా విద్యారంగం, ఉపాధ్యాయ రంగ సమస్యలపై సమరశీల పోరాటల్లో చురుకుగా పాల్గొంటున్న సంగతి తెలిసిందే.

రూ.352 కోట్లతో అభివృద్ధి పనులు

ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలోని పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో రూ.352 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి వెల్లడించారు. బుధవారం స్థానిక ఐటిడిఎలోని తన ఛాంబర్లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అడలి వ్యూ పాయింట్ నుంచి ఎల్ఎన్ పేట వరకు రోపో ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. అడలి రహదారి విస్తరణ, రక్షణగోడ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేశామని చెప్పారు. అడ్వెంచర్ పార్కు.కు రూ.1.5 కోట్లు మంజూరయ్యాయని, నిధులు వస్తే కొత్త ఈవెంట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పక్కా భవనాలు లేని 17 పాఠశాలలను గుర్తించి, భవనాల మంజూరు కోసం ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడం కోసం అన్ని పాఠశాలలలో ఆర్ఒ ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఏకలవ్య మోడల్ స్కూల్, బొమ్మిక, బీంపురం, చినకోష్ట ఆశ్రమ పాఠశాలల్లో త్రీ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు రూ. 22.86 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. గిరిజన ప్రాంతంలో సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనకు శ్రీకాకుళం జిల్లా పరిధిలో 44059 మందికి పరీక్షలు చేశామని, అందులో 7426 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. అందులో 16 మందికి పాజిటివ్ వచ్చిందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో 49,465 మందికి సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు చేసినట్లు వివరించారు.పిఎం జన్‌మన్‌కు 1,16,840 మంది ఆదివాసీలను గుర్తించినట్లు చెప్పారు. వీరిలో 1689 మందికి ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. 375 ఇళ్లు ప్రారంభించారని, 1314 ఇళ్లు ప్రారంభించుటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్

మొబైల్ కనెక్టివిటీని అందించడానికి శ్రీకాకుళం జిల్లా పరిధిలో 29 సెల్ టవర్లను మంజూరు చేస్తే అన్ని టవర్లూ వినియోగంలోకి వచ్చాయని చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో 27 సెల్ టవర్లు మంజూరు చేస్తే, 26 టవర్లు వినియోగంలోకి వచ్చాయని, మిగిలిన టవర్ పని పురోగతిలో ఉందని వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా పరిధిలో రహదారి సౌకర్యం లేని 145 ఆవాస ప్రాంతాలకు గాను 72 గిరిజన గ్రామాలకు రూ.51.92 కోట్ల అంచనా వ్యయంతో 71 రోడ్లు మంజూరైనట్లు చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో రహదారి సౌకర్యం లేని 146 ఆవాస ప్రాంతాలకు గాను 50 గిరిజన గ్రామాలకు రూ.118.85 కోట్ల అంచనా వ్యయంతో 50 రోడ్డు పనులు మంజూరైనట్లు చెప్పారు. రోడ్డు పనులు ప్రస్తుతం ప్రగతిలో ఉన్నట్లు వివరించారు.

విద్యాసంస్థల్లో రాజకీయ జోక్యం వద్దు

- పాఠశాలలో పాత ఎండిఎం కార్మికులను కొనసాగించాలి
- సిఐటియు నాయకుల డిమాండ్
- కొత్తవలస ప్రాథమిక పాఠశాల వద్ద ధర్నా

పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-పార్వతీపురం

తల్లిదండ్రులు, పాఠశాల విద్యా కమిటీ వద్దంటున్నా.. ఎమ్మెల్యే ఒత్తిడికి లొంగి డిఇఒ వంటలమ్మలను తొలగించడం అన్యాయమని సిఐటియు నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యాసంస్థల్లో రాజకీయ జోక్యం వద్దని డిమాండ్ చేశారు. బుధవారం పార్వతీపురం పట్టణంలోని కొత్తవలసలో పురపాలక ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మథరావు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో 94 మంది విద్యార్థులు ఉంటున్నారని, వారికి శుచి, రుచికి అనుగుణంగా పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని స్వయంగా తల్లిదండ్రుల కమిటీ, ఉపాధ్యాయులందరూ గత సమావేశంలో అభినందించుకున్నట్లు మినిట్స్‌లో కూడా పొందుపరిచారని తెలిపారు. నేడు రాజకీయ నాయకులు వారికి అనుకూలమైన వారిని నియమించాలని డిఇఒ నుంచి కిందనున్న ఉపాధ్యాయుల వరకు ఒత్తిడి తీసుకురావడం సరైన చర్య కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని తెలుసుకున్న తల్లిదండ్రుల కమిటీ ఇదేమి చర్యని ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల ఆదేశమని ఉపాధ్యాయులే పేర్కొనడం హేయమైన చర్యని వాపోయారు. దీని వెనుక రాజకీయ జోక్యం ఉన్నట్లు స్పష్టమవుతుందని చెప్పారు. విద్యార్థులకు అన్నం పెట్టే వంటమ్మలపై ప్రజాప్రతినిధులు కుట్ర చేయడం, ఉపాధిని దెబ్బ కొట్టడం అన్యాయమని అన్నారు. అసలు విద్యాసంస్థల్లో అక్రమ రాజకీయ జోక్యం సరైనది కాదని, వెంటనే ఇటువంటి వైఖరిని విడనాడాలని డిమాండ్‌చేశారు. పాఠశాలలో పాత మధ్యాహ్న భోజన కార్మికులనే కొనసాగించాలని, కార్మికులపై రాజకీయ వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రధానోపాధ్యాయులు స్పందిస్తూ పాత వారినే కొనసాగిస్తున్నట్లు ఎంఇఒ నుంచి ఇప్పుడే ఆదేశాలు అందాయని తెలపడంతో ఆందోళనను ముగించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు, కోశాధికారి గొర్లి.వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర, నాయకులు బి.వి.రమణ, కోరాడ ఈశ్వరరావు, పి.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వినతి అందిస్తున్న ఎండిఎం కార్మికులు, యూనియన్ నాయకులు

డిఇఒకు వినతి

కొత్తవలస పురపాలక ప్రాథమిక పాఠశాలలో తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులను మళ్లీ కొనసాగించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం (సిఐటియు అనుబంధం) నాయకులు వి.ఇందిర, గొర్లి వెంకటరమణ అన్నారు. ఈ మేరకు డిఇఒను నిర్వాహకులతో కలిసి సిఐటియు నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్ల నుంచి పనిచేస్తున్న వారిని ఎటువంటి కారణమూ లేకుండా తొలగించడం అన్యాయమన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల నిర్ణయం మేరకు పాతవారినే మధ్యాహ్నం భోజన నిర్వాహకులుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు, సిఐటియు నాయకులు దావాల రమణారావు, కొల్లి సాంబమూర్తి, బంకురు సూరిబాబు, పి.రాజశేఖర్ సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు కొండేటి రాధ, రెడ్డి హేమ, అగ్గాల స్వాతి, బొండపల్లి ముత్యాలమ్మ, ఐల్ల జ్యోతి పాల్గొన్నారు.

దావోస్ టూర్.. వ్యక్తిగతమా? అధికారికమా?

- ఎమ్మెల్యే బోనెల సాధించిందేమిటోనన్న చర్చ
- సదస్సుకు హాజరవ్వడమే గొప్పగా టిడిపి శ్రేణుల ప్రచారం

ప్రజాశక్తి-పార్వతీపురం

ఇటీవల దావోస్‌లో జరిగిన అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తల సదస్సులో ఎపి ప్రభుత్వం తరపున సిఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ నాయకత్వంలో కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేలా పారిశ్రామిక వేత్తలను మెప్పించడానికి ఎపి ప్రభుత్వం తరపున కీలక ప్రతినిధులు హాజరయ్యారు. హాజరైన ప్రతినిధి బృందం లో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఉండటం చర్చ నీయాంశమవుతోంది.

ఇంతవరకు దావోస్‌లో జరిగిన పెట్టుబడుల సదస్సుల్లో ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రధాన కార్యదర్శి స్థాయి అధికారులు మాత్రమే హాజరయ్యారు. అయితే పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర దావోస్ టూర్‌కి వెళ్లడం ఆయన వ్యక్తిగతమా, అధికారికమా అనే చర్చ జరుగుతోంది. గతంలో ఎన్నడూ ఎమ్మెల్యే స్థాయి ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వం తరపున అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుకు హాజరైన దాఖలాలు లేవు. కానీ ఎమ్మెల్యే విజయచంద్ర హాజరవడంపై టిడిపి నాయకులు, కార్యకర్తలు మాత్రం గొప్పగా డప్పుకొంటున్న పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన ప్రతినిధి బృందం సభ్యులే ఎలాంటి హడావుడీ లేకుండా రాష్ట్రానికి చేరుకున్నారు. కానీ ఎమ్మెల్యే విజయచంద్ర పర్యటనను ఆయన అనుచరులు మాత్రం వేనోళ్ల కీర్తిస్తున్నారు. అత్యంత వెనుకబడిన మన్యం జిల్లాకు పరిశ్రమలను తీసుకొచ్చారన్నంతగా ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రానికే ఆశించిన స్థాయిలో పెద్దగా పెట్టుబడులు రాలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఒక అధికారపార్టీ ఎమ్మెల్యే స్థాయిలో నియోజకవర్గానికి గాని, జిల్లాకు ఏం పెట్టుబడులు తీసుకొస్తారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఎమ్మెల్యే విజయచంద్ర రాజకీయాల్లోకి రాకముందు ఎన్నారైగా విదేశాల్లో ఉద్యోగాలు చేశారు. విదేశీ కంపెనీలతో ఆయనకు పరిచయాలు ఉంటే ఉండొచ్చు. కానీ ఆ పరిచయాలు పెట్టుబడులు ఆకర్షించేందుకు ఏమేరకు ఉపయోగపడతాయనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. దావోస్‌లో జరిగిన అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుకు హాజరవడమే గొప్ప ఘనకార్యం సాధించినట్లు పార్టీ శ్రేణులు చెప్పుకుంటున్నాయి. ఆయన దావోస్‌కు ఎపి అధికారిక బృందంతో వెళ్లారు. గురువారం ఆయన నియోజకవర్గానికి వస్తున్న నేపథ్యంలో స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన అనుచరులు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునివ్వడం కొసమెరుపు.

వ్యతిరేకతను కప్పిపుచ్చడానికేనా?

గడిచిన ఎనిమిది నెలల్లో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచే గట్టి వ్యతిరేకతను ఎదుర్కొంటున్న పరిస్థితి కనిపిస్తోంది. నియోజకవర్గంలో ఏ చిన్నా చితకా ఉద్యోగాలున్నా బేరం పెడుతున్నారనే అభిప్రాయం పార్టీ శ్రేణుల నుంచే వ్యక్తమవుతోంది. పార్టీ స్థానిక నాయకుల సిఫార్సులను బేఖాతరు చేస్తూ తనకి నచ్చిన వారికి ఉద్యోగాల కోసం సిఫార్సు చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇటీవల రేషన్ డీలర్ పోస్టుల భర్తీ వ్యవహారంలోనూ ఆయన దండిగా చేతివాటం ప్రదర్శించారనే చర్చ నడుస్తోంది. ప్రతిపక్ష పార్టీ నాయకులు సిఫార్సు చేసిన వారిని రేషన్ డీలర్ పోస్టులకు సిఫార్సు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాక్షాత్తూ సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలే ఆయన నివాసం వద్ద తీవ్ర నిరసన వ్యక్తం చేయడం హాట్‌టాపిక్‌గా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ఎమ్మెల్యే అనుచరులు దావోస్ పర్యటనని పెద్ద విజయం సాధించిన చందంగా చెప్పుకోవడం, గురువారం రాక సందర్భంగా భారీ స్వాగత సన్నాహాలు చేస్తున్న తీరు వ్యతిరేకతని కప్పిపుచ్చడానికేనన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

1/70 చట్టం జోలికి రావద్దు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో భూమిపై సర్వ హక్కులు స్థానిక గిరిజనులకే చెందుతాయని నిర్దేశించే 1/70 చట్టం జోలికి ఎవరూ రావద్దని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే విద్య, ఉద్యోగ అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్న గిరిజనులు భూమిపై, అడవిపై ఆధారపడి బతుకుతున్నారని తెలిపారు. ఆ అవకాశాలు కూడా లేకుండా చేయాలని ఎవరు ప్రయత్నించినా తీవ్ర ప్రతి ఘటన తప్పదని హెచ్చరించారు. స్పీకర్ అయ్యనపాత్రుడు వ్యాఖ్యలు వ్యక్తిగతమా, ప్రభుత్వ ఆలోచనా స్పష్టం చేయాలని డిమాండ్‌చేశారు.

స్పీకర్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

విశాఖ వేదికగా నిర్వహించిన పెట్టుబడుదారుల సదస్సులో స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టంపై సడలింపులు చేయాలని చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఇంటికుప్పల రామకృష్ణారావు డిమాండ్ చేశారు. బుధవారం కురుపాంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ఆదివాసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో అరకులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పాలకొండలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్.. జిఒ నంబర్ 3 పునరుద్ధరణపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్‌చేశారు. ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. స్పీకర్ స్థాయిలో ఉండి రాజకీయాల్లో అపార అనుభవం ఉండి ఆదివాసీల గుండె కాయల్లాంటి 1/70 చట్టం సడలించాలని చేసిన వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. స్పీకర్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రంలోని ఉన్న ఆదివాసీలమంతా ఏకమై ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అనుపోత్సవంలో పాల్గొన్న ఆలయ ఇఒ, ఉత్సవ కమిటీ చైర్మన్, సభ్యులు, జనం

ఘనంగా పోలమాంబ అనుపోత్సవం

4న శంబర మారు జాతర

ప్రజాశక్తి-మక్కువ

రాష్ట్ర గిరిజన దేవత జాతరగా పేరొందిన శంబర పోలమాంబ అనుపోత్సవం బుధవారం ఘనంగా ముగిసింది. ఉదయం మేళ తాళాల నడుమ చదురుగుడి నుంచి అమ్మవారి ఘటాలను సావిడి వీధి వద్దకు ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ, ఉత్సవ కమిటీ ఛైర్మన్ నైదాన తిరుపతిరావు, ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మన్ పూడి దాలినాయుడు, గ్రామ పెద్దలు అంతా కలిసి తీసుకొచ్చారు. అక్కడ సంప్రదాయం ప్రకారం.. ఉయ్యాల కంబాలు కార్యక్రమం నిర్వహించారు. భామాకలాపం అమ్మవారి ముందు ప్రదర్శిస్తూ, వనంగుడి వైపు అమ్మవారి ఘటాలను నడిపించారు. దారి పొడుగునా జనం పొర్లుదండాలు పెట్టారు. వనం గుడికి చేరుకున్న తర్వాత ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం ఘటాలను వనం గుడిలోని విగ్రహం ముందు ఉంచారు. ఈ ఘట్టంతో నెల రోజుల పాటు గ్రామంలో జరిగే జాతర ముగిసింది. దీంతో మరుసటి ఏడాది వరకు వనంగుడిలోనే అమ్మవారిని ప్రజలు దర్శించుకుని, మొక్కులు తీర్చుకుంటారు.

4న మారు జాతర

వచ్చే నెల 4న పోలమాంబ అమ్మవారి మారు జాతర వనం గుడి వద్ద జరగనుంది. మిగిలిన 8 వారాల కూడా ఇక్కడే జాతర నిర్వహిస్తారు. ఇక నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రజలంతా తొలుత వనం గుడిని సందర్శించి, తరువాత చదురుగుడిలో దర్శనానికి వెళ్తారు.

రూ 3.91 లక్షలు పెరిగిన ఆదాయం

శంబర జాతరలో గత ఏడాది కంటే ఈసారి మొదటి మంగళవారం టికెట్లు, వేలం పాటల ద్వారా సుమారు 3,91,005 రూపాయలు ఎక్కువ ఆదాయం లభించినట్లు ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ వెల్లడించారు. గత ఏడాది మొత్తం టికెట్ల ఆదాయం రూ.21.11 లక్షలు కాగా, ఈ ఏడాది 25.02 లక్షలు వచ్చిందని తెలిపారు.

అర్జీలు పెండింగ్ ఉంచొద్దు

జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో వచ్చిన అర్జీలు పెండింగ్ లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి బుధవారం ఆమె వీడియో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో నమోదైన పిజిఆర్ఎస్ దరఖాస్తులను ఎప్పటికపుడు పరిశీలిస్తూ, పరిష్కారం చూపాలన్నారు. అందిన అర్జీలను 48 గంటల్లోగా పరిష్కరించాల్సి ఉన్నప్పటికీ, వాటిని పరిశీలించకపోవడంతో పెండింగులో ఉంటున్నాయన్న సంగతిని గుర్తుచేశారు. ఇకపై ఇటువంటివి పునరావృతం కారాదని, జాప్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. సమస్య పరిష్కారానికి కొంత సమయం అవసరమైన సందర్భాలలో ఆ వారం ముగిసేలోగా వాటిని పరిష్కరించేలా చూడాలన్నారు. రెవెన్యూ శాఖలో ఎక్కువగా పెండింగ్ ఉంటున్నాయని, వాటిపై ఆయా అధికారులు తగిన శ్రద్ధ కనబరచాలని చెప్పారు. ఈ సమావేశంలో పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, కెఆర్ఆర్‌సి ఎస్‌డిసి పి.ధర్మ చంద్రారెడ్డి, ఇతర జిల్లా అధికారులు, మండల తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

గోలవలస సమీపంలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుమ్మిడిగూడ పంచాయతీ గోలవలస సమీపంలో ఏనుగుల గుంపు బుధవారం సంచరించింది. ఇప్పటివరకూ కొమరాడ మండలంలోని పాలెం గ్రామ సమీపంలో సంచరించిన ఏనుగుల గుంపు గోలవలస చేరుకుంది. దీంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పొలాలకు రైతులు జాగ్రత్తగా వెళ్లాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. పంటలు ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగులను గ్రామాలకు దూరంగా తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

గోలవలస గ్రామ సమీపంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

ప్రజాశక్తి
www.prajasakti.com

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా మీనాక్షి

కోర్టు ఉత్తర్వులతో దిగొచ్చిన జిల్లా అధికారులు

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ విఆర్ మీనాక్షి బుధవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ సివిల్ డాక్టర్‌గా సూపరింటెండెంట్ బాధ్యతలు అప్పగించాలని ఆమె కొంత కాలంగా పోరాడుతున్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఉమ్మడి జిల్లా వైద్య సేవల అధికారి సూపరింటెండెంట్‌గా ఆమెని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మంత్రి సంధ్యారాణి సహకారంతో ఆస్పత్రిలో నిరుపేద రోగులకు వైద్య సేవలు అందేలా చూస్తామని తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ మీనాక్షి

నేడు మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపల్ కౌన్సిల్, బడ్జెట్ సమావేశాలను గురువారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ జి.శ్రీనివాసరాజు తెలిపారు. చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర హాజరవుతారని చెప్పారు. పాలకవర్గ కౌన్సిల్ సభ్యులతోపాటు కార్యాలయంలో ఉన్న పలు విభాగాలు అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మండ ఎంపిపి పాఠశాల విద్యార్థులకు ఏకలవ్య పాఠశాలలో ప్రవేశ పరీక్షల సన్నద్ధత శిక్షణను బుధవారం నిర్వహించారు. ఏకలవ్య పాఠశాల పాఠశాల నుంచి ఉపాధ్యాయులు వచ్చి ఐదో తరగతి విద్యార్థులకు ప్రవేశ పరీక్షపై అవగాహన కల్పించారు. ఏకలవ్య పాఠశాలలో విద్య ఆవశ్యకత వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పాలక దేవానంద్, ఉపాధ్యాయులు గణేష్, సిహెచ్ విద్యాసాగర్ ఉన్నారు.

అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన సిడిపిఒ

ప్రజాశక్తి-సాలూరు

గంజాయిభద్ర పంచాయతీ దిగువశెంబి గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ సిడిపిఒ బి.విజయలక్ష్మి, సూపర్‌వైజర్ లక్ష్మి బుధవారం పరిశీలించారు. సోమవారం సాయంత్రం దిగువశెంబి అంగన్వాడీ కేంద్రం నుంచి నేమ్ బోర్డు, కొన్ని చార్టులను ఒడిశా పోలీసులు తీసుకెళ్లారని పిఒ విజయలక్ష్మి చెప్పారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న పోషకాహార పదార్థాలు, ఇతర వస్తువులేవీ తీసుకెళ్లలేదని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కి వచ్చి నేమ్ బోర్డు, చార్టులను తీసుకెళ్లాలని కొటియా పోలీసులు హెల్పర్ భర్తతో చెప్పినట్లు తెలిపారు.

టెక్నికల్ సర్టిఫికెట్లు సిద్ధం

ప్రజాశక్తి-పార్వతీపురం

గతేడాది ఏప్రిల్‌లో జరిగిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు సర్టిఫికెట్లను తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.తిరుపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల ఉత్తీర్ణత సర్టిఫికెట్లు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పాస్ అయిన అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో చూపించి ఉత్తీర్ణత సర్టిఫికెట్లను తీసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని తామరకండి గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఎఒ ఎస్.అవినాష్ ఆధ్వర్యాన బుధవారం శిక్షణ ఇచ్చారు. పామాయిల్, జీడి మామిడి పంటల సాగు గురించి ఉద్యానశాఖాధికారి ప్రత్యూష బాను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎడి కె.శ్రీనివాసరావు, కెవికె శాస్త్రవేత్త, తదితరులు పాల్గొన్నారు

క్షేత్రస్థాయిలో బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి-సీతంపేట

క్షేత్రస్థాయిలో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు మండంగి విశ్వనాథం జనసైనికులకు సూచించారు. సీతంపేటలోని పార్టీ కార్యాలయంలో జన సైనికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఇటీవల జనసేన పార్టీకి గాజు గ్లాసు గుర్తును రిజర్వ్ చేయడంతో మండల కమిటీతో ఆనందం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎన్.ఉపేంద్ర, ఎం.శ్రీకాంత్, ఎం.నరేష్, ఎం.అరుణ్, సర్పంచ్ రవి, కుమార్, ఉప సర్పంచ్ రాజారావు, గణేష్, కోటేశ్వరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

108 అత్యవసర సహాయకులకు శిక్షణ

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

108 వాహనంలో డ్రైవర్‌తోపాటు ఉండే అత్యవసర వైద్య సహాయకులకు బుధవారం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో శిక్షణ ఇచ్చారు. శిక్షకులు ఆలుబిల్లి శ్రీనివాసరావు.. అపస్మారక, గుండె ఆగిపోయే పరిస్థితుల్లో ఉన్నవారికి సిపిఆర్ చేసి ప్రాణాపాయం నుంచి రక్షించడం, మానవ శరీర అంతర నిర్మాణాలు, విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 108 జిల్లా మేనేజర్ మన్మథనాయుడు, ఒఇ గిరిబాబు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా మొక్కలను తొలగిస్తున్న పోలీస్ సిబ్బంది

పిచ్చిమొక్కలు తొలగింపు

ప్రజాశక్తి- గరుగుబిల్లి

పార్వతీపురం నుంచి గరుగుబిల్లి వెళ్లే రహదారికి ఇరువైపులా గొట్టివలస గ్రామం వద్ద ఉన్న పొదలను, పిచ్చిమొక్కలను బుధవారం ఎస్ఐ రమేష్ నాయుడు ఆధ్వర్యంలో తొలగించారు. వాహన ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు తొలగిస్తున్నట్లు ఆయన తెలిపారు. మలుపుల వద్ద వాహనదారులు పరిమిత వేగంతో ప్రయాణించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయ జిల్లాగా విజయనగరం

వేపాడ: విజయనగరం జిల్లాను ప్రకృతి వ్యవసాయ జిల్లాగా ప్రభుత్వం గుర్తించిందని ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు అన్నారు. మండలంలోని బొద్దాం, వీలుపార్తి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్న రైతులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మన జిల్లాను ప్రకృతి వ్యవసాయ జిల్లాగా గుర్తించిందన్నారు. జిల్లాలో రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు శానపతి లీలా అప్పారావు పాల్గొన్నారు.

వ్యక్తుల కోసం వ్యవస్థను మార్చేస్తారా?

అధికారులపై ఎంపిపి పద్మావతి ఆగ్రహం

ప్రజాశక్తి - కురుపాం

'మండల అభివృద్ధికి మేం వ్యతిరేకం కాదు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు తెలియకుండా కార్యక్రమాలు చేస్తున్నారు. వ్యక్తుల కోసం వ్యవస్థను మార్చేస్తారా?' అని ఎంపిపి శెట్టి పద్మావతి.. అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో సర్పంచులకు, ఎంపిటిసిలకు తెలియకుండా కార్యక్రమాలు జరుగుతున్నాయని, అది సమంజసం కాదని చెప్పారు. అధికారులు గ్రామస్థాయిలో ఎటువంటి కార్యక్రమం చేసినా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని, అంతే తప్ప ఎవరో చెప్పినట్టు విని వ్యవస్థను తప్పుదారి పట్టించొద్దని సూచించారు.

సమావేశంలో ఎంఇఒ ఎన్.సత్యనారాయణ మాట్లాడు తుండగా, ఉదయపురం సర్పంచ్ బి.అరుణకుమారి జోక్యం చేసుకుంటూ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పక్కా భవనం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రతి సమావేశంలో సమస్యను ప్రస్తావిస్తున్నా, పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పాఠశాల భవన నిర్మాణ అంశం కోర్టు పరిధిలో ఉండడం వల్ల జాప్యమవుతున్నట్లు ఎంఇఒ వివరణ ఇచ్చారు. కురుపాం ఎంపిటిసి సంతోషిని మాట్లాడుతూ ఆదర్శ పాఠశాల వద్ద మధ్యాహ్న భోజనం బాగోలేదని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎంఇఒ స్పందిస్తూ మాట్లాడుతూ ప్రత్యేక కమిటీ వేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు మాట్లాడు తుండగా, సర్పంచులకు, ఎంపిటిసిలకు తెలియకుండా వ్యవసాయ శాఖ కార్యక్రమాలు గ్రామస్థాయిలో జరుగుతున్నాయని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిపి పద్మావతి మాట్లాడుతూ స్థానిక సర్పంచులు, ఎంపిటిసిలకు తెలియకుండా గ్రామస్థాయిలో కార్యక్రమం సమంజసం కాదని, ఇకనుంచి ప్రతీ కార్యక్రమం తెలియజేయాలని ఎఒను ఆదేశించారు. అనంతరం విద్యుత్తు శాఖ ఎఇ కోటేశ్వరరావు మాట్లాడుతున్న సమయంలో గ్రామస్థాయిలో లైన్‌మేన్లు ఎవరూ సక్రమంగా పనిచేయడం లేదంటూ సర్పంచులంతా మూకుమ్మడిగా ఫిర్యాదు చేశారు. ఎఇ మాట్లాడుతూ లైన్‌మేన్లతో సమావేశం ఏర్పాటుచేసి, గ్రామ స్థాయిలో విధులు, బాధ్యతల గూర్చి వివరించి, సక్రమంగా పనిచేసేలా చేస్తానని హామీ ఇచ్చారు.

వివిధ శాఖలు అధికారులు మాట్లాడినప్పుడు సర్పంచులు, ఎంపిటిసి వారి పంచాయతీ పరిధిలోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపిడిఒ ఉమామహేశ్వరి మాట్లాడుతూ రానున్న వేసవికాలం నేపథ్యంలో క్రాస్ ప్రోగ్రామ్ మండలంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ తాగునీటి సమస్య లేకుండా సర్పంచులు, ఎంపిటిసిలు బాధ్యత తీసుకొని వారి పరిధిలో బోర్లను మరమ్మతులు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కె.నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి బి.అన్నాజీరావు, వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శెట్టి పద్మావతి

విద్యారంగంపై కుట్ర రాజ్యాంగంపై దాడే

సదస్సులో మాట్లాడుతున్న కవి గంటేడ గౌరినాయుడు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

విద్యారంగంపై చేస్తున్న కుట్ర రాజ్యాంగంపై దాడి చేసినట్లేనని ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు అభిప్రాయ పడ్డారు. బుధవారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే అంశంపై ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.డేవిడ్ అధ్యక్షతన సదస్సు ఏర్పాటుచేశారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన గౌరినాయుడు మాట్లాడుతూ బడిలో చెప్పేది మాత్రమే చదవటం కాదని, సమాజం గురించీ చదవాలని విద్యార్థులకు సూచించారు. సమాజం గురించి తెలుసుకోవలసిన అవసరం నేటి విద్యార్థులకు ఉందన్నారు. రాజ్యాంగం అందరికీ విద్యా హక్కు, ప్రభుత్వ రంగంలో ఉద్యోగ రిజర్వేషన్లు కల్పించిందన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని ప్రాథమిక హక్కులు కల్పించిందని తెలిపారు. అలాంటి రాజ్యాంగ హక్కులపై దాడి జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. మనువాదుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.రాజు మాట్లాడుతూ రాష్ట్రం హక్కులను కేంద్రం లాగేసిందని, ప్రాథమిక విద్యను కూడా తన చేతుల్లోకి తీసుకుందని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి వేల ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలు మూసేయడానికి చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమైందని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ జాతీయ విద్యా విధానంలో భాగమే ఈ కుట్ర కూడానన్నారు. రాష్ట్రాలతో నిమిత్తం లేకుండా కేంద్రం ఏకపక్షంగా చేసిన నిర్ణయాలను రాష్ట్రం అమలు చేయడం దారుణమన్నారు. దీనిపై చేపట్టే పోరాటాల్లో విద్యార్థులంతా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి.అఖిల్, మండల నాయకులు సాయి, శారద, రాజేష్, కవిత, సుకన్య, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు తాతబాబు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో కనీస సౌకర్యాలు కల్పించాలి

వినతి అందిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి - కురుపాం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఉలక వాసదేవరావు, అనిల్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రి సమీపంలో బోరు లేక పేషెంట్‌తో వచ్చినవారు నీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాచ్‌మేన్, ల్యాబ్ టెక్నీషియన్ పోస్ట్ ఖాళీగా ఉన్నాయని చెప్పారు. చిన్నపిల్లలకు జన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు కావాలన్నా బయట ఎక్కడికో వెళ్లి తీసుకురావడానికి గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి ఆస్పత్రిలో ప్రింటింగ్ మిషన్, బోరు ఏర్పాటు చేయాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అనంతరం ఆస్పత్రి సమస్యలపై సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు మండంగి ఇండియా, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

జీడి ప్రాసెసింగ్ యూనిట్లకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్వతీపురం పట్టణంలో జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు స్థలాన్ని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ బుధవారం పరిశీలించారు. గిరిజన సంక్షేమ శాఖ, కేంద్ర ప్రభుత్వ నిధులతో రెండు జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లు పార్వతీపురం ఐటిడిఎకు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో పార్వతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాముల్లో జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ఉన్న అనుకూల పరిస్థితులను పిఒ పరిశీలించారు. ఈ పర్యటనలో ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు, జిసిసి డిఎం, మార్కెటింగ్ ఎడి, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-సీతానగరం

ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డేలో జాతీయ ఉత్తమ పంచాయతీగా ఎంపికై, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నుంచి అవార్డు స్వీకరించిన రామవరం సర్పంచ్ పెంట సత్యంనాయుడును ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.ప్రసాదరావు మాట్లాడుతూ పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపి జాతీయస్థాయిలో పురస్కారానికి ఎంపిక కావడానికి సర్పంచ్ చేసిన కృషి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వి.తవిటినాయుడు, కె.లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్‌ని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వీల్‌చైర్‌ను అందజేస్తున్న సోఫా సభ్యులు

వీల్‌చైర్ వితరణ

ప్రజాశక్తి-మక్కువ

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పొట్నూరు మౌనికకు సాలూరుకు చెందిన ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ (సోఫా) సభ్యులు డాక్టర్ రవి, శివాజీ వీల్‌చైర్‌ను బుధవారం అందజేశారు. స్థానిక ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు వికలాంగ విద్యార్థిని మౌనికకు సహాయంచేశారు. పాఠశాల సిబ్బంది.. సోఫా సభ్యులను అభినందించారు ఈ కార్యక్రమంలో సోఫా సభ్యులు ఎ.గణపతి, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిల సందర్శన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని సీతానగరం, పెద అంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు బుధవారం సందర్శించారు. తొలుత సీతానగరం పిహెచ్‌సిలోని మందుల నిల్వ గదిని పరిశీలించారు. ల్యాబ్ టెస్టులు, వివిధ రకాల సర్వే అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 68 రకాల రక్తపరీక్షలు చేపడుతున్నట్లు చెప్పారు. గర్భిణుల రక్తహీనత లేకుండా ముందస్తుగా వారికి అవగాహన కలిగించే కార్యక్రమం ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. అనంతరం పెద అంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి వినోద్ కుమార్, వైద్యాధికారులు ఉషారాణి, రాధాకాంత్, సిసి శ్రీనివాసరావు, ఇఒలు ఎస్‌వి వెంకట్రావు, జి.సూర్యనారాయణ, హెచ్‌విలు సత్యవతి, వరలక్ష్మి, యుడిసి ఎం.మురళి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

ప్రజలకు అందని ఆధార్ సేవలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఆధార్ కేంద్ర సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో సేవలు అందడం లేదని సిపిఎం జియ్యమ్మవలస మండల కార్యదర్శి కోరంగి సీతారాం తెలిపారు. బుధవారం జియ్యమ్మవలసలో ఉన్న ఆధార్ కేంద్రానికి తాళం వేసి ఉంది. ఈ కేంద్రాన్ని సిపిఎం నాయకులు పరిశీలించారు. దీంతో ఆయన మాట్లాడుతూ ఆధార్‌లో సవరణ, కొత్తగా నమోదు కోసం వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇదేనా ప్రజలకు అందిస్తున్న ఆధార్ సేవలు అంటూ ప్రశ్నించారు. వారంలో ఆధార్ కేంద్రం తెరవకపోతే ప్రజలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.మోహన్‌రావు ఉన్నారు.

ఆధార్ కేంద్రం వద్ద వేచి ఉన్న ప్రజలు

మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి

జగన్ పాలనలో ఆర్థిక విధ్వంసం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి

ప్రజాశక్తి-సీతంపేట

మాజీ ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి ఆరోపించారు. స్థానిక నాయకులతో కలిసి బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జగన్ కుటుంబం లూటీ రూ.8 లక్షల కోట్లని, ఐదేళ్లలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రజా ధనాన్ని కొల్లగొట్టారని ఆరోపించారు. భూకేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్ అనుమతులు.. ఇలా ప్రతి దాంట్లో ఆశ్రిత పక్షపాతానికి ఒడిగట్టారని విమర్శించారు.

గుండె కాయలాంటి సచివాలయాన్ని కూడా తాకట్టుపెట్టారని చెప్పారు. గడచిన 7 నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి జగన్ ప్రభుత్వం చేసిన రూ.22 వేల కోట్లు బకాయిలను టిడిపి ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లించాలని, ఇది ప్రభుత్వానికి గుది బండలా మారిందని తెలిపారు.

పోలమాంబను దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని మరుపెంట గ్రామంలో చినశంబర పోలమాంబను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపిపి ఉరిటి రామారావు, సర్పంచ్ ఉరిటి నిర్మల ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అక్కేన మధుసూదనరావు, మద్రాపు పురుషోత్తం నాయుడు, మరడాన తవిటినాయుడు, ద్వారపురెడ్డి సత్యనారాయణ, పొట్నూరు వెంకటనాయుడు, ముదిలిబాబు విజయవాంకుశం, మరుపెంట ఎస్ఎంసి చైర్మన్ దొగ్గ ధనుంజయ్, అక్కేన రామకృష్ణ, వాడ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

పార్వతీపురం ఫ్లైఓవర్‌పై ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్ ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం జరిగింది. మృతుడు బెలగాం ప్రాంతానికి చెందిన సంతోష్‌గా స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్న పట్టణ పోలీసులు యువకుడి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.

మృతిచెందిన యువకుడు

పేకాట శిబిరంపై దాడులు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కొంచ గ్రామ సమీపంలో పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడులు చేపట్టారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నాలుగు ద్విచక్ర వాహనాలు, రూ.32,150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు.